విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

సోమవారం 07 జులై 2025 8 పేజీలు

సమస్యలు పరిష్కారానికి పోరాటం

- జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ....
- సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య....

విశాలాంధ్ర -చింతలపూడి: క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించి పరిష్కారం అయ్యేవరకు సీపీఐ పోరాటాలు చేస్తూనే ఉంటుందని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. సీపీఐ ఏలూరు జిల్లా ద్వితీయ మహాసభల ప్రతినిధుల సభలో గత మహాసభ నుంచి నేటి మహాసభ వరకు జరిగిన కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గత మూడు సంవత్సరాలలో చేసిన పోరాటాలను వివరించారు. సీపీఐ శత వసంతాలు జరుపుకుంటున్న నేపథ్యంలో రాబోయే కాలంలో అనుసరించాల్సిన వ్యూహాలు, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. ప్రధానంగా చింతలపూడి ఎత్తిపోతల పథకం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల పరిహారం, గిరిజనులకు పోడు భూములకు పట్టాల కంపెనీ కోసం గతంలో సీపీఐ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించామని, అయితే పాలకులు నిర్లక్ష్యం వహించిన కారణంగా ఈ మహాసభలో అనుసరించాల్సిన విధి విధానాలు ఖరారు చేస్తామన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేస్- 1, పేస్ -2 తక్షణమే పూర్తి చేయాలని తీర్మానం ప్రవేశపెట్టారు. వేలేరుపాడు మండల కార్యదర్శి బాడిశ రాము పోలవరం నిర్వాసితులకు పునరావాసం, ఆర్థిక సహాయం, పరిహారం చెల్లింపు పూర్తి చేసి, ఉమ్మడి రాష్ట్రాలకు అనుబంధంగా ఉన్న గుమ్మడి పల్లి పెదవాగు గండిని పూడ్చి, ప్రాజెక్టును పునర్ నిర్మించి, సాగునీరు అందించాలని తీర్మానం ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య గిరిజన సమస్యలను పరిష్కరించాలని, ఆనాదిగా గిరిజనులుసాగు చేసుకుం టున్న పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు వన సంరక్షణ సమితి సభ్యులకు అటవీ బంజరు భూములకు వ్యక్తిగత చెట్టుపట్టా ఇవ్వాలని తీర్మానం ప్రవేశపెట్టారు. పై తీర్మానాలను ప్రతినిధులు సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

దూరం...దూరం...

ప్రస్తుతం ఎన్నికలు లేవు.. అయినా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రాజకీయ ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం గ్రామాలు.. పట్టణాలు.. ఎక్కడబడితే అక్కడ ఇదే చర్చ నడుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలన పేరుతో ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇదంతా బాగానే ఉంది.. అయితే ఇక్కడి ప్రజలకు వస్తున్న అనుమానాలు ఎవరు నివృత్తి చేస్తారో అర్థం కావడం లేదు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాలలో బుధవారం నుంచి సుపరిపాలన పేరుతో తెలుగుదేశం ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు ప్రజల వద్దకు వెళుతున్నారు. ఎన్నికలలో ఎగిరిన మూడు జండాలలో పసుపు జెండాలు మాత్రమే కనిపిస్తుండడం ప్రజల్లో చర్చకు దారి తీస్తోంది.

- మారుతున్న రాజకీయ లెక్కలు...
- టీడీపీ తొలి అడుగుకు దూరంగా జనసేన, బీజేపీ..
- జగన్ కౌంటర్‌గా కార్యాచరణ...
- కొత్త సందేహాలకు అవకాశం...

విశాలాంధ్ర బ్యూరో ఏలూరు: కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలన పేరుతో ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాలలో బుధవారం నుంచి సుపరిపాలన పేరుతో తెలుగుదేశం ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు ప్రజల వద్దకు వెళుతున్నారు. పభుత్వం సాధించిన విజయాలు మూడు పార్టీలతో ఏర్పడిన టమికి దక్కుతుందనే చర్చ ప్రజలలో నడుస్తోంది. ఈ క్రమంలో టీడీపీ నేతలు మాత్రమే తొలి అడుగు పేరుతో ప్రజలలోకి వెళ్ళటం ఏమిటనేది ఆసక్తికరంగా మారుతోంది. ఈ కార్యక్రమంలో నేరుగా చంద్రబాబు పాల్గొంటున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ మాత్రం దూరంగా వున్నారు. బీజేపీ సైతం తొలి అడుగుకు దూరంగా ఉంది.

సందేహాలు ఎన్నో....?

జనసేన, బీజేపీ ఇందులో భాగస్వామ్యం ఎందుకు తీసుకోవటం లేదనేది అంతుచిక్కని అంశంగా మారుతోంది. అటు వైసీపీ ఏడాది పాలనలో హామీల విస్మరణ...వైఫల్యాలపైన ప్రజల్లోకి వెళ్తాంది. ఈ సమయంలో కూటమిలో పరిణామాలుకీలకంగా మారుతున్నాయి. ఏం జరుగుతోంది ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాల గురించి ప్రజల్లోకి వెళ్తున్న సమయంలో.. దీనిని మూడు పార్టీలు సంయుక్తంగా నిర్వహించకపో వటం కొత్త చర్చకు కారణమవుతోంది. టీడీపీ నేతలు మాత్రమే ప్రజల్లోకి వెళ్లటం ఏంటనే చర్చ జరుగుతోంది. దీంతో..కూటమి పార్టీల మధ్య ఏం జరుగుతుందనే అంశంపైన విశ్లేషణలు మొదలయ్యాయి. భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సమిష్టిగా మూడు పార్టీలు నిర్వహిస్తే.. కలిసి కట్టుగా ప్రజల్లోకి వెళ్లటంతో సానుకూల సంకేతాలు వెళ్తాయని.. ఇప్పుడు వేర్వేరుగా ఉండటంతో కొత్త సందేహాలకు అవకాశం యిచ్చినట్లవుతుందనే ▶మిగతా 2లో..

మాది ప్రజా ప్రభుత్వం..
ప్రజలే పాలకులు : మంత్రి

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : కూటమిది ప్రజా ప్రభుత్వం..ప్రజలే పాలకులు, సుపరిపాలనలో తొలి అడుగు విజయం రాష్ట్ర ప్రజలకు అంకితమని, వారి సంక్షేమమే ధ్యేయంగా భవిష్యత్తు పాలన అందిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం కాకినాడ ఇంద్రపాలెంలోని పల్లపు వీధి, రామాలయం, మెరక వీధి, కొత్తూరులో కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కాకినాడ రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్‌కు ప్రజలు ఘనంగా స్వాగతం పలికి హారతులు పట్టారు. మంత్రి ఇంటింటికి వెళ్లి ఏడాదిలో కూటమి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు వివరించారు. అలాగే ప్రజాభిప్రాయాలు సేకరించి మై టిడిపి యాప్‌లో పొందుపరిచారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ గత ఏడాది కాలంలో సీఎం చంద్రబాబు నాయుడు ▶మిగతా 2లో..

జాతీయ సమ్మె జయప్రదానికి ఆటో ప్రచారం 6

దూరం...దూరం...

(1వ పేజీ తరువాయి)

విశ్లేషణలు మొదలయ్యాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ, జనసేన పార్టీలు దూరంగా ఉండటంపైన కూటమి నేతలు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

మారుతున్న రాజకీయ లెక్కలు...

ఉమ్మడి జిల్లా రాజకీయాలలో కొత్త లెక్కలు తెరమీదకు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏడాదికాలం పూర్తి సందర్భంగా చంద్రబాబు కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఏడాది పాలనపైన ప్రజలలోకి వెళ్లి వివరించేందుకు తొలి అడుగు పేరుతో పర్యటనలు ప్రారంభించారు. అయితే ప్రభుత్వ విజయాలపై చేస్తున్న కార్యక్రమానికి బీజేపీ, జనసేన దూరంగా వున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రస్తుతం ఇదే రాజకీయ చర్చ. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పాల్గొనలేదు. ఈ కార్యక్రమం టీడీపీ సోలోగా నిర్వహిస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న జనసేన, బీజేపీ ఈ కార్యక్రమంలో ఎందుకు పాల్గొనడం లేదనేది ఆసక్తికరంగా మారుతోంది.

తొలి అడుగులు కనిపించని భాగస్వామ్యం...

కూటమి పార్టీలు సొంతంగా బలం పెంచుకోవడంపైనే ఫోకస్ చేస్తున్నాయి. ఏడాది పాలనపై టీడీపీ నేతలు తొలి అడుగు పేరుతో ప్రజలలోకి వెళ్లారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జనసేన దూరంగా ఉన్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన కార్యక్రమాలలో ఎక్కడా భాగస్వామ్య పార్టీలు కనిపించడం లేదు. మాజీ ముఖ్యమంత్రి జగన్ లక్ష్యంగా టీడీపీ వ్యూహాలు అమలు చేస్తోంది. జగన్ కౌంటర్ గా కార్యాచరణ అమలు చేస్తున్నారు. అదే సమయంలో బీజేపీ నేతలు ఏపీ కేంద్రంగా తీసుకుంటున్న నిర్ణయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కొత్తగా చేసిన నియమాకాలతో పాటుగా తాజాగా చేస్తున్న డిమాండ్లపైన కూటమిలో చర్చ మొదలైంది. ఎంతోకాలంగా బీజేపీ రాజకీయంగా ఎదగాలని ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పుడు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇటీవల రాష్ట్రానికి అమిత్ షా పర్యటించిన సమయంలో పార్టీ నేతలకు ఇదే అంశాన్ని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. కూటమిలో.. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నా... పార్టీ సొంతంగా బలం పెంచుకోవడంపైనే నేతలంతా నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారని సమాచారం. ఇక బనకచర్ల విషయంలోనూ కేంద్రం తీసుకున్న నిర్ణయం సర్వత్రా చర్చనీయాంశం అయింది. కేంద్రానికి స్పష్టత ఇచ్చి ఈ ప్రాజెక్టు విషయంలో అనుమతులు సాగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అనూహ్యంగా ఇదే సమయంలో బీజేపీ ఏపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. అసలు బీజేపీ లేకపోతే.. ప్రభుత్వం ఈ స్థాయిలో విజయం సాధించేదా..? అంటూ ప్రశ్నించారు. అదే సమయంలో కూటమిలోని తమ పార్టీకి కేటాయిస్తున్న 5 శాతం వాటాపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉండటం, రాష్ట్రంలో బీజేపీ మద్దతు ఓటమి విజయానికి కీలకమని విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. ఇప్పుడు ప్రజలలో ఈ వ్యాఖ్యలు చర్చకు దారితీస్తున్నాయి. ఎవరి వ్యూహాలు ఫలించి అంతిమ విజయం సాధిస్తారు వేచి చూద్దాం.

'మెగా పేరెంట్స్ మీట్'కు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్

విశాలాంధ్ర ఏలూరు: జిల్లాలో ఈనెల 10న నిర్వహించనున్న 'మెగా పేరెంట్స్ మీట్'నకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలనీ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో 'మెగా పేరెంట్స్ మీట్' కార్యక్రమం ఏర్పాట్లపై ఆదివారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 1810 ప్రభుత్వ,558 ప్రైవేట్ పాఠశాలలు మొత్తం 2,368 పాఠశాలల్లోనూ, 140 జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని, ఆరోజు జరగనున్న కార్యక్రమాలపై ఇన్విటేషన్ రూపొందించి విద్యార్థుల తల్లితండ్రులకు, ప్రముఖులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి విద్యార్థులందరూ యూనిఫామ్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఆహ్లాదకరమైన వాతావరణంలో 'మెగా పేరెంట్స్ మీట్'జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు, తల్లితండ్రులు, ప్రముఖులు పెద్దఎత్తున హాజరయ్యే అవకాశం ఉన్నందున, వారికి భోజన సదుపాయాలతో ఎటువంటి సమస్యలు లేకుండా జాగ్రత్తగా వండించాలన్నారు. పాఠశాల కిచెన్‌లో అగ్నిప్రమాదలు వంటి చోటుచేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలనీ, అగ్నిమాపక సిబ్బంది సహకారం తీసుకోవాలన్నారు. విద్యార్థులచే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందు కోసం అటవీ శాఖ అధికారులు లక్షా 64 వేల 170 మొక్కలను సిద్ధం చేశారని, పాఠశాలలకు అవసరమైన మొక్కలను దగ్గరలోని అటవీశాఖ నర్సరీ ద్వారా పొందాలన్నారు. తల్లితండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఫోటో సెషన్ నిర్వహించాలని, అమ్మ ప్రాముఖ్యతను తెలియజేసేలా తల్లికి వందనం నిర్వహించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థినీ విద్యార్థులకు వైద్య పరీక్షలు వెంటనే పూర్తి చేసి,కార్యక్రమం రోజున విద్యార్థుల ఆరోగ్య నివేదిక ను అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని కలెక్టర్ ఆదేశించారు. మానసిక ఆరోగ్యం,సైబర్ క్రైమ్ పై అవగాహన, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సందేశాలు, పిల్లల పురోగతిపై ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించాలన్నారు.ప్రైవేట్ పాఠశాలల్లో కూడా 'మెగా పేరెంట్స్ మీట్' కార్యక్రమం నిర్వహించేలా సంబంధించి పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించాలన్నారు. 'మెగా పేరెంట్స్ మీట్' కార్యక్రమం ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయాలన్నారు. కార్యక్రమం ఏర్పాట్ల పనులు, 10న 'మెగా పేరెంట్స్ మీట్' కార్యక్రమం నిర్వహణను ఎల్.ఈ.ఎ.పి. యాప్' లో పొందుపరచాలన్నారు.ఈ సందర్భంగా జిల్లాలో 1840 ప్రభుత్వ పాఠశాలల్లోని లక్షా 54 వేల 113 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని,జూనియర్ కళాశాలల విద్యార్థులకు రెండురోజులలో ఆరోగ్య పరీక్ష పూర్తిచేస్తామని, వారందరికీ ఆరోగ్య పరీక్షా కార్డులను పంపిణీకి సిద్ధం చేస్తామని డిఎంహెచ్ ఓ కలెక్టర్ వివరించారు.

సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - కలిదిండి: సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఆంద్రాజు. శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మండలంలోని పెద్దలంక గ్రామంలో పరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ ఆధ్వర్యంలో వెలమపేటలో సంవత్సర కాలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను నాయకులతో కలసి ఇంటింట ప్రచారం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఏర్పడి తర్వాత అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని తెలిపారు. పింఛన్లు పెంపు, తల్లికి వందనం, మెగా డీఎస్సీ, దీపం పథకం అమలు, అన్నా క్యాంటీన్లు పునరుద్ధరణ అమలు చేసారని అన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వేగంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి. శ్రీనివాస చక్రవర్తి, ఏ .వెంకటాచలం, కొక్కిలిగడ్డ. ఆంజనేయులు, నాయకులు దున్న. భోగేశ్వరరావు, కొల్లాటి. సత్యనారాయణ, ఒడుగు. గోపాలం, దుగ్గిరాల. పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు

విశాలాంధ్ర- పాలకోడేరు : ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా పాలకోడేరు మండల వ్యాప్తంగా ఆదివారం డెల్టా వాటర్ ప్రాజెక్ట్ చైర్మన్ కునాదరాజు మురళీ కృష్ణంరాజు ఆధ్వర్యంలో యాంటీ రేబిస్ టీకాలు వేసినట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ టి. ఇచ్చి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రాణాంతకరమైన రేబిస్ వ్యాధి పట్ల పెంపుడు కుక్కలను పెంచుకునే యజమానులంతా అవగాహన అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ జునోటిక్ వ్యాధుల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. మండల వ్యాప్తంగా పాలకోడేరు, మోగల్లు, విస్సాకోడేరు గ్రామాలలో సుమారు 60 టీకాలు వేసినట్టు తెలిపారు . ఈ కార్యక్రమంలో ఏ హెచ్ ఏ లు సుధీర్ రాజు, లీలా కృష్ణ, దుర్గ, సుబ్బారావు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆపదలో ఉన్న పేదవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని కూటమి పార్టీల నాయకులు పేర్కొన్నారు. మండలంలో బయ్యనగూడెం గ్రామానికి చెందిన తొంట .కృష్ణ అనారోగ్యానికి గురి కావడంతో పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు చిర్రి బాలరాజుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోగా బాలరాజు సీఎం సహాయనిధి కృష్ణ కు రావడానికి కృషి చేశారని, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అతని భార్య తొంట. కాంచనకు అందజేయడం జరిగిందని కుటమి పార్టీల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలం నరేష్, మద్దు తేజ, శ్రీను, మహేష్, రాధాకృష్ణ, దుర్గా ప్రసాద్, గోపి పాల్గొన్నారు.

ప్రజలే పాలకులు : మంత్రి

(1వ పేజీ తరువాయి)

నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని, కరపత్రాలు పంచుతూ వివరించారు. 2014-2019లో అభివృద్ధి, సంక్షేమం రెండూ చేసినా, ప్రజలకు సరిగా చెప్పలేకపోయిన కారణంగా 2019లో పార్టీకి నష్టం కలిగిందని గుర్తుచేశారు. ఈసారి అలాంటి పొరపాటు జరగకూడదని, చేసిన ప్రతి మంచి పనిని ప్రజల్లోకి తీసు కెళ్తున్నామన్నారు. వైసీపీ హయంలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిందని, ఇప్పుడు పారిశ్రామిక వేత్తలు తిరిగి విశ్వాసంతో నవ్యాంధ్రలో రూ.9.34 లక్షల కోట్లతో పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నారని తెలిపారు. వీటి ద్వారా 8.5 లక్షల ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉందన్నారు. గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు రావడం కూటమి ప్రభుత్వ ఘనత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అతిపెద్ద స్థాయిలో 64 లక్షల మందికి పింఛన్లు అందిస్తుండగా, ఇందుకు ఏడాదికి రూ.34 వేల కోట్లు ఖర్చువుతున్నట్లు చెప్పారు. సూపర్ 6 హామీలలో భాగంగా తల్లికి వందనం పథకం కింద 67.27 లక్షల విద్యార్థులకు నగదు జమ చేశామని, దీపం-2 కింద ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి మహిళలకు అమలు, డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసాకు రూ.250 కోట్లు, 204 అన్నా క్యాంటీన్లు ద్వారా రూ.5 కే నాణ్యమైన భోజనం, అర్చకులకు, నాయీ బ్రాహ్మణులకు, పాస్టర్లకు, ఇమామ్ మౌజన్లకు గౌరవ వేతనాలు అందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణం, ల్యాండ్ టైటిలింగ్ యాక్టర్ రద్దు, 77 ప్రాజెక్టుల పథకాల పునరుద్ధరణ, రూ.9.34 లక్షల కోట్ల పెట్టుబడు లకు ఒప్పందాలు వంటి అభివృద్ధి జరుగుతుం దన్నారు. ప్రతిపక్ష హోదా లేని పార్టీలు రాష్ట్రంపై విష ప్రచారం చేస్తూ, కుల, మతాల పేరిట రెచ్చగొడుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జగన్ జైలు యాత్ర.. ఓదార్పుయాత్ర లంటూ కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, పార్టీ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకె శ్రీనివాస బాబా, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు ఎం గంగయ్య, నియోజకవర్గ, మండల కన్వీనర్లు, యూనిట్, బూత్ కన్వీనర్లు, అనుబంధ సంఘ నాయకులులు పాల్గొన్నారు.

చంద్రన్నపాలనా సంక్షేమ పాలనా: ఇజ్జగాని

విశాలాంధ్ర- చాట్రాయి: కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన సంవత్సర కాలంలో సంక్షేమం వెల్లి విరుస్తోందని, అభివృద్ధి పట్టా లెక్కిందని చాట్రాయి మండల టీడీపీ అధ్యక్షులు ఇజ్జగాని వెంకటేశ్వరరావు, కొనియా డారు. ఆదివారం చాట్రాయి మండలం, చనుబండ గ్రామంలో 2వ బూత్‌లో కూటమి నాయకులు ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచుతూ 'సుపరిపాలనలో తొలిఅడుగు-ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇజ్జిగాని మాట్లాడుతూ .ఎన్టీఆర్ భరోసా పెన్షన్ డబ్బులు 4 వేలకు, వికలాంగుల పెన్షన్ సొమ్ము 6 వేలకు పెంచిన ఘనత సిఎం చంద్రబాబుదే అన్నారు. రాబోయే నాలుగు సంవత్సరాల్లో రాష్ట్రాన్ని చంద్ర బాబు అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు , టిడిపి మండల ప్రధాన కార్యదర్శి తేళ్ళూరి శేఖర్, ములగల పాటి శ్రీనివాస రావు,మారేశ్వరరావ్, తేనేటి వేణు, మోదుగు ముత్తయ్య, బొట్టు దుర్గారావు, శ్రీరామ్, విస్సంపల్లి రాజా, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేబీస్ వ్యాధి నివారణకు టీకాలు పంపిణీ

విశాలాంధ్ర -భీమవరం: శునకాల నుంచి మనుషులకు వ్యాపించే రేబిస్ వ్యాధిని టీకాలతో అరికట్టవచ్చునని ప్రభుత్వ పశువుల ఆసుపత్రి ఉప సంచాలకులు డాక్టర్ సుదీర్‌బాబు అన్నారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా భీమవరం పట్టణంలోని ప్రాంతీయ పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో రేబీస్ వ్యాధి నివారణకు కుక్కలకు ఉచిత టీకాలను పంపిణీ చేశారు. సుదీర్ మాట్లాడుతూ రేబీస్ వ్యాధి ప్రాణాంతమైన వ్యాధి అని, ఆ వ్యాధి కుక్కల నుంచి వ్యాపిస్తుందన్నారు. జిల్లా జంతు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ వ్యాధిని నివారించేందుకు ప్రతి కుక్కకు రేబీస్ టీకాలను వేయించాలని, ప్రతి మూడు మాసాలు దాటిన కుక్కలకు రేబీస్ నివారణ టీకాలు వేయించాలన్నారు. ఈ టీకా పశు వైద్యశాలలో ఉచితంగా వేస్తారని చెప్పారు. పశువుల ఆసుపత్రి సహాయ సంచాలకులు డాక్టర్ జయకర్ జాన్సన్, డాక్టర్ పుందారి బాబు, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ లలిత, గో సంరక్షణ అధ్యక్షులు సుంకర దాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి పర్వదినం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో అంకాల గూడెం గ్రామంలో శ్రీ గంగానమ్మ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో విధమ్మ అమ్మవారి ఆలయం వద్ద రజకులు అంతా కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కులదైవం విధమ్మ అమ్మవారి ఆలయం వద్ద కన్నుల పండుగగా తొలి ఏకాదశి నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కడకట్ల ఏడుకొండలు, కోమటికుంట నాగేశ్వర రావు, కడకట్ల మహలక్ష్మయ్య, తాతయ్య, సతీష్, శారద, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ లో 320 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర - నరసాపురం: స్థానిక కోర్ట్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 320 కేసులు పరిష్కరించినట్లు నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జి . గంగరాజు తెలిపారు. ప్రింటింగ్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రభావం, వల్లనే అయా కోర్టులలో పెండింగ్ లో ఉన్న కేసులు రాజీ చేయడం జరిగిందన్నారు. మోటార్ వాహన ప్రమాద భీమా కేసులు ఇంతకుముందులా ఏలూరు జిల్లా కోర్ట్ కి వెళ్లకుండా ఇక్కడ నుండే మైక్రోసాఫ్ట్ టీమ్ యాప్ ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులతో మాట్లాడి రాజీ చేసుకోవడం విశేషం అన్నారు. ప్యానల్ లాయర్స్ పారా లీగల్ వాలంటీర్లు, మీడియా సహకరించడం వల్లనే ఈ సారి ఎక్కువ కేసులు రాజీ చేసినట్లు తెలిపారు. జాతీయ లోక్అదాలత్ ను 3 బెంచ్ లుగా ఏర్పాటుచేశారు. బెంచ్ అధికారులుగా న్యాయమూర్తులు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జి. గంగ రాజు, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఆర్. వరలక్ష్మి, అదనపు.సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎస్. రాజ్య లక్ష్మి , మరియు సభ్యులుగా ఎన్. కుమార్ రత్నం , ఓ . జ్యోతి మాంగల్య, జి. వినోద్, ,బెంచ్ సభ్యులుగా వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు సి. హెచ్. బాలాజీ, నరసాపురం టౌన్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ లు , కోర్టు లైజన్ ఆఫీసర్ సూర్య భాస్కరరావు, పోలీస్ అధికారులు మరియు సీనియర్ జూనియర్ న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిద్దార్ద్ పాల్గొన్నారు. మొత్తం కోటి ఇరవై ఒక్క లక్షల రూపాయలు విలువ కక్షి దారులకు లబ్ది చేకూరేలా అవార్డులను జారీ చేసినట్లు, సీనియర్ న్యాయవాది పోలిశెట్టి వి.వి. నారాయణ స్వామి కక్షిదారులకు వెజిటబుల్ బిర్యాని అందించారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి : కోనాల

విశాలాంధ్ర- తణుకు: కార్మిక హక్కులను హరిస్తూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన జులై 9న దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని ఏఐటీయూసీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు పిలుపు నిచ్చారు. ఆదివారం తణుకు అక్కమాంబ టెక్స్‌టైల్స్ స్టాఫ్అండ్ వర్కర్స్ యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్ ల ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ గేటు వద్ద జరిగిన సమావేశంలో భీమారావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలు రద్దు చేసి కార్పొరేట్లు, పెట్టుబడి దారులకనుకూలంగా కార్మికులను కట్టుబానిసలను చేస్తూ మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్స్ తెచ్చిందన్నారు. 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి 12 గంటల పని విధానానికి పూనుకోవడం ద్వారా కార్మికులకు తీవ్ర ద్రోహం తలపెడుతూ పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందన్నారు. కార్మిక, ఉద్యోగులకు తీవ్రహాని కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు కోరుతూ జరుగనున్న 9 న దేశవ్యాపిత సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని భీమారావు అన్నారు. అక్కమాంబ టెక్స్ టైల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చిక్కాల దుర్గా ప్రసాద్, ఎన్.ఫణీంద్ర, దేవ పెద్దిరాజు, పంపన శ్రీను, అనంత త్రివిక్రమరావు, విడివాడ ప్రసాద్, పుచ్చకాయల భాస్కరరావు, ఇసుకపల్లి రమేష్ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం

విశాలాంధ్ర, ద్వారకాతిరుమల: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా కలియుగ ప్రత్యక్ష దైవం చిన్న వేంకన్న కొలువైన ద్వారకాతిరుమల క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని కనులారా దర్శించి మురిసిపోయారు. సెలవు రోజు, తొలి ఏకాదశి రెండూ కలిసి రావడంతో రాష్ట్ర నలు మూలల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. పలువురు భక్తులు తెల్లవారు జామునే కేశఖండనశాలకు చేరుకుని తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చిన్న వెంకన్నని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు వస్తూనే ఉన్నారు. దీంతో శ్రీవారి దర్శన క్యూలు, ప్రసాదాల కౌంటర్లు, అన్నదానం క్యూలు, కేశఖండనశాల, ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సామాన్య భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి సుమారు 3గంటల సమయం పట్టింది. వృద్ధులు, దివ్యాంగులు, చంటి బిడ్డ తల్లులను ప్రత్యేక క్యూల ద్వారా దర్శనానికి అనుమతించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

ఆనందరాజు మృతి తీరనిలోటు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం గ్రామానికి చెందిన ప్రముఖ రాజు వేగేశ్న ఫౌండేషన్ అధినేత వేగేశ్న ఏసుదాతరాజు పెద్ద కుమారుడు వేగేశ్న ఆనందరాజు మృతి తీరనిలోటు అని ఆదివారం పలువురు అన్నారు. ఇండియాలో రాజు వేగేశ్న ఫౌండేషన్ సంస్థ పేరుతో వేగేశ్న అనంత కోటిరాజు సౌజన్యంతో అనేక ఆర్థికప రమైన సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఆనందరాజు (67) అనారోగ్యంతో మద్రాస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి ఆనందరాజు స్నేహితులు నడింపల్లి సోమరాజు ఎన్ శ్రీరామరాజు వేగేసిన సుబ్బరాజు వి శ్రీనివాసరాజు వి ప్రసాదరాజు, రుద్రరాజు వెంకట సూర్యనారాయణ రాజు (ఆర్ వి ఎస్ రాజు), ఆర్ పుల్లం రాజు కె రంగరాజు ఎల్ కె శ్రీనివాసరాజు కాకర్ల విష్ణు శ్రీనివాసరావు మాజీ ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు సంతాపం తెలిపారు.

ఘనంగా ఏకలవ్య జయంతి

విశాలాంధ్ర- కాళ్ల : ఎరుకల కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలని కాళ్ళ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కాళ్ల లో ఏపీ ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతి ఆదివారం నిర్వహించారు. ఏకలవ్య జయంతి సభకు ఏపీ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కమిటీ కార్యదర్శి కుతాడి నరసింహామూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎరుకల కులస్తుల హక్కుల సాధన కోసం కృషి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామ టిడిపి అధ్యక్షుడు పెంటపాటి వెంకట నాగేశ్వరరావు,ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సంఘాల సమైక్య వ్యవస్థాపకులు సోడదాసి గంగయ్య లు మాట్లాడుతూ ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలన్నారు. బందారు నాని, బందారు సోమేశ్వరరావు, కడలి ప్రదీప్, ఏపీ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు కుతాడి లావణ్యపాల్గొన్నారు.

కలిదిండి మండలంలో..

విశాలాంధ్ర - కలిదిండి: గురు భక్తి కలిగిన ఏకలవ్యుని జయంతిని తొలి ఏకాదశి రోజు ఘనంగా నిర్వహించారు. ఆదివారం కలిదిండిలో కోరుకొల్లు రోడ్డులో ఉన్న ఏకలవ్య విగ్రహానికి మాజీ ఏఎంసి చైర్మన్ వల్లభనేని. శ్రీనివాస్ చౌదరి, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంక. రత్తయ్య పూల మాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కుంభ. నాగరాజు, పలువురు నాయకులు, పాల్గొన్నారు.

ఏకలవ్య జయంతి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : విలువిద్యలో గొప్పవాడు ఏకలవ్యుడు అని ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పోలా రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఎస్టీ ఏరియాలో ఎరుకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ గురువు లేకపో యినా విలువిద్యలో గొప్పవాడు ఏకలవ్యుడని, గురువుకు గురు దక్షిణ ఇచ్చిన వారిలో మొదటి వ్యక్తి ఏకలవ్యుడేనని కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు పోలా నాగేశ్వరరావు, జగన్నాథం వీరభద్రరావు, పొగడాల పుల్లయ్య, పూజారి. వెంకన్న, పోలా సత్తిబాబు, జగన్నాథం సుంకరి, పోలా కృష్ణ, జగన్నాథం హరికృష్ణ, దాసరి నాగేంద్ర పాల్గొన్నారు.

నేడు యధావిధిగా మీకోసం : కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ జులై 7న సోమవారం జిల్లా స్థాయితో పాటు డివిజనల్, మండల, మున్సిపల్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సి.నాగరాణి తెలిపారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం తో పాటు మండల, డివిజనల్ మున్సిపల్ స్థాయిలో నిర్వహిస్తామని కలెక్టర్ అన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యా దులను సమీపంలోని మండల కార్యాలయాలు, డివిజనల్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాల యాలలో సమర్పించుకోవచ్చునన్నారు. అదే విధంగా అర్జీదారులు తమ అర్జీలను మీకోసం. ఎపి.గవ్.ఇన్ వెబ్సైట్ నమోదు చేసుకోవచ్చని అలాగే వారి యొక్క అర్జీల నమోదు, వివరాలు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని కూడా కలెక్టర్ తెలియజేసారు.

పెంపుడు కుక్కలకు టీకాలు

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలంలోని పెంపుడు కుక్కలకు భౌ అండ్ యారో స్వచంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పశువైద్యశాలలో ఆదివారం టీకాలు వేయించారు. వర్ష కాలంలో కుక్కలకు అనేక వ్యాధులు, దురదలు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుందని కుక్కను పెంచుకునే ప్రతి ఒక్కరు టీకా వేయించాలని వారు సూచించారు. పశువులకు ఇతర జంతువులకు ఆరోగ్యపరమైన ఎటువంటి సమస్యలు వచ్చిన పశు వైద్యశాలకు తీసుకురావాలని సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ భవాని, పశుసంవర్ధక సహాయకులు అశోక్, రాంపండు, రాంబాబు, భౌ అండ్ యారో స్వచంద సంస్థ కో ఆర్డినేటర్ కొవ్వాల క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

కుక్కల సంరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర:లింగపాలెం: కుక్కల సంరక్షణలో పెంపకపుదారులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యశాఖ సహాయ సంచాలకులు లింగయ్య తెలిపారు. కుక్కల దినోత్సవ సందర్భంగా ధర్మాజీగూడెం పశు వైద్యశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఈయన మాట్లాడారు.మూగ జీవాలపట్ల మమకారంతో ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ధర్మాజీ గూడెం, లింగపాలెం, కె.గోకవరం వైద్యశాలలో కుక్కలకు వ్యాక్సిన్లు వేశారు. ఈ కార్యక్రమంలో లింగపాలెం పశు వైద్యాధికారి కిరణ్, కె.గోకవరం వైద్యశాలలో నాగరాజు, ధర్మాజీగూడెం లో గోపాల్ వ్యాక్సిన్లు వేశారు.

తానా మీట్లో ఎమ్మెల్యే రోషన్‌కుమార్

విశాలాంధ్ర-లింగపాలెం: నార్త్ అమెరికాలో నిర్వహించిన 24వ తానా ఎన్.ఆర్.ఐ మీట్లో చింతలపూడి నియోజకవర్గ ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, ప్రముఖ వ్యక్తి మురళీమోహన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఈమీట్లో ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ తెలుగు జాతి గొప్పతనం, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధిని ప్రశంసిస్తూ ప్రసంగించారు.

గుండెపోటుతో వీఆర్ఓ మృతి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం కాశిపాడు గ్రామ రెవెన్యూ అధికారిగా (వీఆర్ఓ) గా పనిచేయుచున్న పల్లి చంద్రశేఖర్ (50) ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చంద్రశేఖర్‌కు భార్య ఇద్దరు కుమారులు వున్నారు. ఆయన స్వగ్రామము నిడమర్రు మండలం పెదనింద్రకొలను గ్రామము. వీఆర్ఓ మృతికి గణపవరం తహసీల్దార్ వై కె వి అప్పారావు, గణపవరం మండల వీఆర్ఓల సంఘం, రెవెన్యూ సిబ్బంది సంతాపం తెలిపారు.

రైతు బజార్‌లో జేసీ ఆకస్మికంగా తనిఖీ

విశాలాంధ్ర -భీమవరం: వినియోగదారులకు సరసమైన ధరల్లో నాణ్యమైన కూరగాయలు, సరుకులు అందజేయాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. పట్టణంలోని రైతు బజార్‌ను జాయింట్ కలెక్టర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు బజార్ అంతా కలియ తిరిగారు. రైతు బజార్‌లో లభ్యమవుతున్న కూరగాయలు, పండ్లు, ఆకు కూరలు, నిత్యవసర సరుకులు షాపులను పరిశీలించారు. వాటి నాణ్యతపై ఆరా తీశారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తాజాగా ఉండాలని వ్యాపారస్తులకు జెసి సూచించారు. కూరలు కొన్న వినియోగదారులతో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. బోర్డు మీద ఉన్న ధరలకే కూరగాయలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సరస్వమైన ధరలలో నాణ్యమైన కూరగాయలు, సరుకులను అందించుటకే ప్రభుత్వం రైతు బజార్లను ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది రైతు బజారు బయట నిర్వహిస్తున్న షాపులను వెంటనే ఖాళీ చేపించి లోపల అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రోడ్డు పై ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ సిఐను ఆదేశించారు. రైతు బజార్‌లో షాపులపై కప్పులు పాడైపోయి ఉండడం గమనించిన ఆయన వెంటనే రైతు బజార్ మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు, షాపుల పై కప్పులు, ఇంటర్నల్ డ్రైనేజీ రిపేరు చేయుటకు ప్రతిపాదనలను తయారుచేసి నిధులు మంజూరు కోసం చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ ఏడికి సూచించారు. పాడైన ఎల్ ఈడి బోర్డు తక్షణం రిపేర్ చేయించాలని, త్రాగునీరు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని. మరుగుదొడ్లు , ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయించి శుభ్రముగా ఉంచాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులు ను ఆదేశించారు. ఈ సందర్భంలో మార్కెటింగ్ ఎడి కె.సునీల్ కుమార్, రైతు బజార్ ఎస్టేట్ అధికారి పి.కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు ఏఎంసీ చైర్మన్ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చిన్న వెంకన్న ఆలయాన్ని గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు సతీ సమేతంగా ఆదివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఏఈవో నటరాజారావు శ్రీవారి చిత్ర పటాన్ని బహూకరించారు. మొగతడకల శ్రీనివాసరావు, లక్ష్మీరమణి, ఓంప్రకాష్ చౌదరి, పాకనాటి శేషు, తేలు బాబి, బొద్దు అశోక్ పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

విశాలాంధ్ర ఏలూరు: ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సేవలను సోమవారం మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో నేడు సోమవారం ఉదయం గం. 10 నుంచి యధావిధిగా పిజిఆర్ఎస్ నిర్వహించబడుతున్నారు. ఇప్పటివరకు జిల్లా స్థాయిలో అమలవుతున్న ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ప్రభుత్వం ఇప్పుడు వికేంద్రీకరించింది. ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల, డివిజనల్,లేదా మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చన్నారు. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు, ప్రభుత్వం అందించిన అధికారిక వెబ్‌సైట్: https://meekosam.ap.gov.in ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే, 1100 (డబుల్ వన్ డబుల్ జీరో) టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు.ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి,సమయానుకూలంగా పరిష్కారమవు తాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని ప్రజలు గుర్తించి పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

శ్రమదానంతో రహదారి నిర్మాణం

విశాలాంధ్ర- పాలకోడేరు : మండల కేంద్రమైన పాలకోడేరులో పంచాయతీ పాలకవర్గం, పంచాయతీ అధికారులు గ్రామ పంచాయతీలో నిధుల కొరత కారణంగా రోడ్లు వేయలేమని చేతులెత్తేయడంతో స్థానికులే చేయి చేయి రహదారి నిర్మాణానికి పూనుకున్నారు. విషయంలోకి వస్తే మండల కేంద్రమైన పాలకోడేరులో గత ప్రభుత్వం పేదలకు గృహాలను నిర్మించుకునేందుకు కోడి గట్టును చేర్చి ఉన్న రెండు ఎకరాల 20 సెంట్లు పేదలకు స్థలాలను కేటాయించింది. ఆ స్థలాల్లో పేదలు నిర్మించుకొని స్థానిక నివసిస్తున్నారు. ఆ ఇళ్లకు వెళ్లడానికి సరైన మార్గం లేక ప్రజలు నానా ఇబ్బందులు పడి మాకు రోడ్డు నిర్మించండి మహ ప్రభువు అని పంచాయతీ వారిని వేడుకొన్న నిధులు కొరతతో పంచాయతీ వారి చేతులెత్తేయడంతో స్థానికులు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కునాధారాజు మురళి కృష్ణంరాజును ఆశ్రయించగా ఆయన స్పందించి తాను కొంత మొత్తాన్ని రోడ్డు నిర్మాణానికి ఇస్తానని చెప్పడంతో స్థానికులు ఇంటింటికి కొంత సొమ్మును వేసుకుని రహదారి నిర్మించుకుంటున్నారు. దీంతో స్థానికులు మాకు కష్టాలు తీరినట్లు అని వర్షం వ్యక్తం చేశారు.

హామీలు అమలు చేయాలి : వంక

విశాలాంధ్ర నూజివీడు: ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని శాసన మండలి సభ్యులు , ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు వంక రవీంద్ర నాథ్ డిమాండ్ చేశారు. నూజివీడు నియోజకవర్గం వైసీపీ కార్యాలయంలో జరిగిన 'బాబు షూరిటీ, మోసం గ్యారెంటీ' రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా రవీంద్ర నాథ్ పాల్గొన్నారు. ఎన్నికలలో సూపర్ సిక్స్ తో పాటు , మరి కొన్ని హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేయడంలో ఇప్పటికే ఒక సంవచరం తాచర్యం జరిగిందని, బలహీన వర్గాలు, పేదవారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రవీంద్ర నాథ్ అన్నారు. ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని పథకాలు అమలు కోసం నిలదీస్తామని, కార్యకర్తలుగా పార్టీ శ్రేణులు గ్రామాలలో ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వైతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. మనం చేసే ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి కొన్ని పథకాలైన ప్రజలకు చేరువచేయాలని రవీంద్ర నాథ్ అన్నారు. నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గం కో-ఆర్డినేటర్, మజీ శాసన సభ్యులు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఉన్నత విలువల కుటుంబం నుంచి వచ్చారని, మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గానికి ఎనలేని సేవలందించారని, అలాంటి నాయకుడికి అందరూ అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేక వెంకట ప్రతాప్ అప్పారావు, కారుమూరి సునీల్, జేపీటీసీ సభ్యులు, ఎంపీటీలు, పార్టీ నాయకులు కార్యకర్తలు విరివిగా పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు తొలగించరా?

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆక్రమణలు తొలగించారు సరే, రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించరా, మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో కన్నాపురం రోడ్డుకి ఇరువైపులా ఉన్న దుకాణాలు ఆక్రమించడంతో , గ్రామానికి చెందినవారు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ అధికారులు రోడ్డు నుండి డ్రైనేజీ వరకు ఏడు అడుగుల దూరంలో ఉన్న ఆక్రమణలను తొలగించడం జరిగింది. ఆక్రమణలను తొల గించిన తర్వాత విద్యుత్ స్తంభాలు రోడ్డుకు అడ్డుగా దర్శ నం ఇవ్వడంతో , ట్రాఫిక్ అంతరాయం కలిగే అవకాశాలు ఉన్నందున విద్యుత్ స్తంభాలను రోడ్డుపై నుండి తొలగించి ప్రక్కకు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మంచినీటి చెరువుకు భూమి పూజ

విశాలాంధ్ర- ఉండి : మండల పరిధిలోని పాములపర్రు గ్రామంలో ఇటీవల తవ్విన పంచాయితీ మంచినీటి చెరువుకు మంచినీరు నింపే నేపథ్యంలో తొలి ఏకాదశి పురస్కరించుకొని మంచినీటి చెరువుకు భూమి పూజ గ్రామ సర్పంచ్ కేసన శాంతి కుమారి బలుసులరావు ఆదివారం చేశారు. పూజా కార్యక్రమం అనంతరం మోటర్లు తో నీరు నింపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ శాంతి కుమారి బలుసులరావు మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు సహకారంతో మంచినీటి చెరువు ఇటీవల వేసవికాలంలో తవ్వటం జరిగిందన్నారు. గత 15 సంవత్సరాల కాలం నుంచి చెరువు తవ్వని కారణంగా నీటి ఎద్దడి ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి నుండి ఆ సమస్య పూర్తిగా పరిష్కారం కావడమే కాకుండా గ్రామంలో రెండు పూటలా సురక్షిత మంచినీటి సరఫరాకు అవకాశం కలిగిందన్నారు. త్వరలోనే డిప్యూటీ స్పీకర్ సహకారంతో మైక్రో ఫిల్టర్స్ సైతం ఏర్పాటు చేయడం జరుగుతుందని వెల్లడించారు. తవ్వకం పనుల లో ప్రజల సహకారం మరువ రా తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ్ పార్టీ అధ్యక్షులు కేసన యాదగిరి, ఉప సర్పంచ్ వర్రె పెద వీరరాఘవులు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, కేసన కోటి బోర్డు సభ్యులు దొనాద్రి శ్రీను, సిబ్బంది కమ్మిల వీరాస్వామి కొమ్మన శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతాలమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తొలి ఏకాదశి సందర్భంగా మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో ఉన్న శ్రీశ్రీశ్రీ చింతాలమ్మ ఆలయాన్ని పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు చిర్రి బాలరాజు సందర్శించి, అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు మంచిగా పండి రైతు కుటుంబాలు సంతోషాలతో ఉండాలని అన్నారు. నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి లక్ష రూపాయలు విరాళాన్ని ఆయన ప్రకటించారు. ముందుగా గ్రామ ఆడపడుచులంతా ఆయనను సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్, కూటమి పార్టీల నాయకులు, రైతులు, మహిళా భక్తులు అధికంగా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర - భీమవరం: ఇండస్ట్రియల్ ఏరియా విద్యుత్ ఉపకేంద్రము పరిధిలో విద్యుత్ తీగల మార్పిడి నిమిత్తం నేడు సోమవారం ఉదయం 9 గం నుండి మధ్యాహ్నం 4 గం' వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసయ్య అగ్రహారంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రామస్వామికి టీడీపీ నాయకుల శుభాకాంక్షలు

విశాలాంధ్ర - సీతానగరం : కూటమి ప్రభుత్వంలో ఇటీవలే డిసిసిబి చైర్మన్ తుమ్మల రామ స్వామిని ఆదివారం తన నివా సంలో టీడీపీ నాయకులు కలిసి శాలువ కప్పి, పుష్ప గుత్యం ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని రైతులకు కష్టకాలంలో అండగా నిలుస్తూ పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని కొనియాడారు. రాబోయే రోజుల్లో డిసిసిబి బ్యాంక్ ద్వారా రైతులకు రుణాలను మంజూరు చేసి రైతులకు అండగా రామస్వామిగారు నిలుస్తారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గద్దె వెంకటకృష్ణ చౌదరి (నల్లి), కాండ్రు శేఖర్, ఓబుల్నేని కృష్ణ చైతన్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' నిర్వహించాలి

విశాలాంధ్ర - తాళ్లపూడి : వైఎస్సార్సీపీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల ప్రకారం రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోలి అనే కార్యక్రమాన్ని ప్రతి గ్రామం లోను ప్రతి వైకాపా కార్యకర్త చేపట్టడం ద్వారా అధికార ప్రభుత్వం ప్రజల్ని మోసం చేసే పరిస్థితిని అర్థం అయ్యేలా పని చేయాలని ఈ కార్యక్రమ పరిశీలకులు గొండే శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్ర మైన తాళ్లపూడి లో మండల పార్టీ అధ్యక్షులు కొలిశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వైకాపా కార్యకర్తల సమావేశానికి కొవ్వూరు నియోజకవర్గ వైకాపా సమన్వయ కర్త తలారి వెంకట్రావు ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ టీడీపీ ఆగడాలను అడు ్డకోవాలని, సూపర్ సిక్స్ పథకాలు అమలు కాలేదన్న విషయాన్ని ప్రజల్లో అర్థమయ్యేలా తెలియచెప్పాలని అన్నారు. పలువురు వైకాపా నాయకులు ఒంబోలు పోసిబాబు, గూడ విజయ రాజు, ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు, గజ్జరం సర్పంచ్ గండి రాంబాబు, ఎంపీటిసి గుంటి చిన్నబ్బాయి, పోసిన కృష్ణ దేవరాయల్ తదితరులు మాట్లాడుతూ, ఎన్డీయే ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం లో మాదిరిగా ప్రజలకు మంచి చేయలేదని, ఎన్నికల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, జగనన్న సంక్షేమ పాలన తప్పని సరిగా అవసరమని పేర్కొన్నారు. పిట్టా శ్రీనివాస్ వ్యాఖ్యాత గా ఈ సమావేశం లో పలుగ్రామల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వేమగిరిలో "సుపరిపాలనలో తొలి అడుగు"

విశాలాంధ్ర - కడియం : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం లో భాగంగా, కడియం మండలం, వేమగిరి టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదేశానుసారం కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, వెలుగుబంటి నాని సారాధ్యన నిర్వహించిన ఇంటింటికి తొలి అడుగు కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా ఆరోగ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ నియోజకవర్గ పరిశీలకులు డొక్కా నాథ్ బాబు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు, అభివృద్ధి, సంక్షేమం ఏ విధంగా పరిపాలన జరుగుతోందనే విషయం మీదుగా సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు మన ప్రతీ ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు మార్గాని సత్యనారాయణ స్థానిక కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలపై ఏపీజీఈఏ తీవ్ర అసంతృప్తి

విశాలాంధ్ర - కడియం : రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల బదిలీలలో అవలంబిం చిన విధానం పట్ల ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. రేషనలైజేషన్ ప్రక్రియలో స్పష్టత లేకపోవడం, ఉద్యోగుల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా బది లీలు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజమహేంద్రవరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో ఎపిజిఇఎ ఆధ్వర్యంలో పి గిరి ప్రసాద్ వర్మ అధ్యక్షతన జరిగిన సచి వాలయ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భం గా ఎపిజిఇఎ జిల్లా నాయకులు కె సుభాకర్ మాట్లాడుతూ, రాష్ట్ర అధ్యక్షులు కెఆర్ సూర్య నారాయణ కోరిన విధంగా కొంత సమయం కేటాయించి బదిలీలు జరిపి ఉంటే ఉద్యో గులు ఇంత ఆందోళన చెందే వారు కాదని అన్నారు. సచివాలయ ఉద్యోగుల నాయకులు ఎమ్ ప్రకాష్ మాట్లాడుతూ, వాలం టీర్ల వ్యవస్థను రద్దు చేసి, అద నపు భారం ఉద్యోగులపై మోపడం సరికాదన్నారు. రేష నలైజేషన్‌లో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శుల సంఖ్యను తగ్గిం చడం అన్యాయమని, వారి అభిప్రాయం తీసుకొని మాత్రమే శాఖలను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ సచివాలయ ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా చేశారని, అయితే ఇత రులు ఇబ్బందులు కలిగించారని సమా వేశం ఆందోళన వ్యక్తం చేసింది. కౌన్సి లింగ్ లేకుండా బదిలీలు జరపడం అన్యా యమని, తమ సమస్యల పరిష్కారానికి ఉద్యో గులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపు ని చ్చారు. ఈ సమావేశంలో బి వీరేంద్ర, ఎన్ఎస్ పూర్ణ చంద్రరావు, నరేష్ బాబు, సతీష్, దయ సాగర్, బల రజని, షైక్ గౌసియా, జి గంగ భవాని, దివ్య మాధురి, సిహెచ్ మంజూష, సురేష్ బాబు, భగవాన్ దాస్, ఛాంబర్లిన్, కె వెంక టేశ్వర రావు, జమీర్, దినేష్ పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణానికి సన్నద్ధం కావాలి

విశాలాంధ్ర - రాజానగరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళలకు త్వరలో ప్రారంభం కానున్న ఉచిత బస్సు ప్రయాణానికి అధికా రులు సన్నద్ధం కావాలని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం అన్నారు. జిల్లా కేంద్ర మైన రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ డిపోను ఆదివారం సందర్శించారు. దీనిలో భాగంగా మెయిన్ బస్ స్టేషన్, పల్లె వెలుగు బస్ స్టేషన్ కార్గో కౌంటర్లను పరిశీలించారు. అధికారులు, ఆఫీస్ సిబ్బంది, ట్రాఫిక్ మరియు గ్యారేజీ సిబ్బందితో జరిగిన సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి,పలు సలహాలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మహిళలకు త్వరలో ప్రవేశపెట్టనున్న ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసేం దుకు బస్సులు స్థితిగతులు(కండిషన్స్) మెరుగు పరచాలని సూచించారు. జీరో యాక్సిడెంట్స్, జీరో బ్రేక్ డౌన్స్ ధ్యేయంగా పనిచేయాలని, ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగ కుండా ఉద్యోగులందరూ పనిచేయాలని తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురా వాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులు కార్మికులు కష్టపడి పనిచేస్తున్నారని వారి ఆరోగ్యాలపై శ్రద్ధ చూపాలని కోరారు. తొలుత జిల్లా ప్రజా రవాణా అధికారి యేలూరి సత్యనారాయణ మూర్తి , డిపో మేనేజర్ కె.మాధవ్, వైస్ చైర్మన్ మునిరత్నంకు దుశ్శాలువ కప్పి, పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో సూపా ర్వైజర్లు, అసోసియేషన్ నాయకులు, సిబ్బంది, సెక్యూరిటీ పాల్గొన్నారు.

సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - సీతానగరం: సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి ప్రచారంలో భాగంగా ఆదివారం సీతానగరం మండలం సీతానగరం గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఇంటి ఇంటికి తిరుగుతూ కరపత్రాలను ప్రజలకు పంచుతూ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి మొదటి సంవత్సరం పూర్తయిన సందర్భంగా గడిచిన సంవత్సరంలో ప్రతి గ్రామంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు వీటి గురించి ప్రతి కుటుంబంలోని ప్రతి ఒక్కరికి పూర్తి అవగాహన ఏర్పరచడానికి "సుపరి పాలనలో తొలి అడుగు" ఇంటింటికి ప్రచార కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసే విధంగా టీడీపీ శ్రేణులు తప్పనిసరిగా పాల్గొనాలి అని కోరారు. చేసి మంచిని ప్రజలకు తెలిపే బాధ్యత టీడీపీ శ్రేణులదే అని అన్నారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షుడు గెద్దం తిమ్ము రావు, కాండ్రు శేఖర్, ఎస్ కే మీరా షరీఫ్ రాజు, కాండ్రు శ్రీనివాసరావు, పెండుర్తి అచ్చియ్య, వలవల రాజా పాల్గొన్నారు.

మాదిగల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కొవ్వూరు : ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే మాదిగలు విద్యా వైద్యం వసతి తదితర విషయాలలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిం చాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్‌ను కోరిన మాదిగ మేధావుల సంఘం నాయకులు. శనివారం కొవ్వూరు పట్టణంలోని ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్ జవహర్ కార్యాలయం నందు ఇంటిలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగస్ (మాదిగ మేధావుల సంఘం) సభ్యులు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కలిసి శుభాకాంక్షలు తెలిపి, ఏజెన్సీ ప్రాంతంలో మాదిగలు పడే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కె ఎస్ జవహర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో మాదిగల పడే ఇబ్బందులు పట్ల సంబంధిత మంత్రితో మాట్లాడి సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గెద్దాడు బాబు రాజు ముద్ద పిచ్చయ్య వేమగిరి ముసలి బాబు డాక్టర్ భానుమూర్తి డాక్టర్ రాయి రాంబాబు వీదు సూరి కెంపురత్నం అయిన వేమగిరి అర్జున్ నాగేశ్వరరావు పాలపోకు మహేష్ స్టాలిన్ సత్యనారాయణ బుచ్చిబాబు చిన్నారావు పాల్గొన్నారు .

మానవత నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - తాళ్లపూడి : మానవత శాఖ ద్వారా సమాజం లో పది మంది పేదలకు సేవలు అందించాలని పలువురు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. తాళ్లపూడి మం డల శాఖ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరి గింది. అనేక సేవ కార్యక్రమాల చేపట్టిన వెలుగుబంటి శ్రీనివాస్ నూతన అధ్యక్షులుగా ఎన్నికోబడ్డారు. కార్యదర్శి గా సనపల రాజశేఖర్, కోశాధికారిగా ఏ.హనుమంత రావు, కార్యవర్గ సభ్యులుగా తీగిరిపల్లి దోసాలు, పెమ్మాడి దుర్గ ప్రసాద్, తైలం పోసారవు, తలారి రామ్మోహన్, ఇం జరపు సత్యనారాయణ, మాధవరావు రమాదేవి లు కార్య వర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. జిల్లా మానవత శాఖ ప్రముఖులు అధ్యక్షతన మానవత చైర్మన్ సింహాద్రి జనా ర్ధన్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ప్రమాణం చేశారు.

నిబంధనలను అధిగమిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - కొవ్వూరు : నిబంధనలకు విరుద్ధంగా స్కూలు కాలేజ్ బస్సులను నడిపితే కఠిన చర్యలు ఉంటా యని కొవ్వూరుమోటార్ వెహికల్ శివ ప్రసాద్ అన్నారు. శనివారం ఆయన తన సిబ్బందితో కలిసి ప్రత్యేక తని ఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు దేవరపల్లి రోడ్డులోని గ్రామ్ ఇండియా బ్రిడ్జ్ ఫైటవర్ దగ్గర విస్తృత తనిఖీలు చేశామని ఆయన తెలిపారు. 16 కేసు లు బస్సుల్లో అటెండెంట్ లేకపోవటం,అగ్నిమాపక యం త్రాలు లేకపోవటం,ఫైర్ అలారం ఏర్పాటు లేక పోవటం, లైసెన్స్ లేకపోవటం చేస్తున్నదు బుక్ చేసి 1,68300 అపరాధ రుసుము విధించామని తెలి పారు. ఈతనిఖీలలో అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ లక్ష్మి ప్రవీణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జంతువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - ఆలమూరు : జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలంతా అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్ అనిత తెలియజేశారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా వెటర్నరీ ఆసుపత్రి ప్రాంగణంలో అవగాహన కార్యక్రమంతో పాటుగా పెంపుడు జంతువులకు ఉచిత టీకాల కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా అన్ని పశు వైద్యశాలల్లో ఉచితంగా ర్యాబిస్ వ్యాక్సిన్స్ వేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిలో షెడ్ ప్రారంభం

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట ప్రభుత్వాసుపత్రిలో లయన్స్ సభ్యుడు ఎస్‌వివి సూర్యనారాయణ మూర్తి సుమారు నాలుగు లక్షలతో నిర్మించిన షెడ్డును పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు వారి బంధువులకు ఎంతో అనువుగా ఉంటుందని ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. అనంతరం యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్ ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను రాజప్ప ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల రంగనాగ్, తెలుగుదేశం పార్టీ నాయకులు అలబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కంటే బాబు, వల్లూరు దొరబాబు, జనసేన నాయకులు సరోజ వాసు, తుమ్మల ప్రసాద్, పిట్ట జానకి రామారావు, లయన్స్ సభ్యులు ఈదల ఈశ్వర్ కుమార్, చిత్తులూరి రాజా, మేక శ్రీను, సేపేని సురేష్, మాజేటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి

విశాలాంధ్ర - మామిడికుదురు : రైతులందరూ బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలని ప్రకృతి వ్యవసాయ విభాగం ఈదరాడ యూనిట్ ఇంచార్జి కుడిపూడి జానకి, ఐసిఆర్టీ చెల్లుబోయిన రాధ పేర్కొన్నారు. ఆదివారం ఈదరాడ గ్రామంలో రైతులకు బీజామృతం తయారీ, వాటి ఉపయోగాలు పై అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి చేసి ఆరబెట్టి చల్లడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చు అని, మొలక శాతం పెరుగుతుందని అన్నారు. 250 కేజీల బీజామృతంతో విత్తన శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జెఎన్‌టియుకెలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి

విశాలాంధ్ర - కాకినాడ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో విసి కాన్ఫరెన్స్ హాలులో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం నిర్వహించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గౌరవనీయులైన ఉపకులపతి ప్రొ సిఎస్ఆర్‌కె ప్రసాద్ డాక్టర్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ నేపథ్యంలో ఉపకులపతి మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ పేరొందిన స్వాతంత్ర్య సమరయోధుడు అని, సంఘ సంస్కర్త, రాజకీయ దురంధరుడని, బీహార్‌లోని వెనుకబడిన వర్గాల కోసం అహర్నిశలు శ్రమించి వారి ఉన్నతికై పాటుపడ్డారన్నారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్ మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 1974 కరువు సమయంలో ఆహార సంక్షోభాన్ని నివారించడానికి ప్రత్యేకంగా అదనపు మంత్రిత్వ శాఖను నిర్వహించమని కోరినపుడు అంగీకారం తెలపడం ఎప్పటికీ గుర్తించుకోవాల్సిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి ప్రొ డి కోటేశ్వరరావు, డైరెక్టర్లు, యుసిఇకె ప్రిన్సిపాల్, మాజీ ఉపకులపతులు, విభాగాధిపతులు, టీచింగ్ & నాన్ టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమ్మె జయప్రదానికి ఆటో ప్రచారం

- నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి
- కేంద్ర కార్మిక సంఘాలు

సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేషాబాబ్జి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర కార్మిక సంఘాల నాయకులు

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఆటో, హమాలి, భవన నిర్మాణం, ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలనే తదితర డిమాండ్లతో కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన జూలై 9 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఆటో ప్రచారాన్ని ఇంద్రపాలెం లాకులు, అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సమ్మె ఏర్పాట్లు ఉధృతంగా సాగుతున్నా యని, కాకినాడ జిల్లాలో సుమారు 50 వేల మంది కార్మికులు సమ్మెకు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. రాక్ సిరామిక్స్, పట్టాభి రైస్ మిల్స్, ఇతర పరిశ్రమల్లో స్థానికులను ఉద్యోగాల నుండి తొలగిస్తుంటే జిల్లా అధికారి యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుందని విమర్శించారు. తక్షణం కాకినాడ పరిసర పరిశ్రమల్లో 75% ఉద్యోగాలు స్థానికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాకినాడ పోర్టు దిగుమతి, ఎగుమతి ట్రాన్స్ పోర్ట్ స్థానిక లారీలకే ఇవ్వడం ద్వారా లోకల్ డ్రైవర్లకు ఉపాధికల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాకినాడ జిల్లాలో సుమారు 5లక్షల మంది అసంఘటితరంగ కార్మికులు, చిన్న సన్నకారు రైతుల కొనుగోళ్లతోనే వ్యాపారాలు సాగుతున్నాయని, వీరి ఆర్థిక, సామాజిక ప్రయోజనాలకై జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు వ్యాపార సంఘాలు రాజకీయాలకు అతీతంగా మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేసారు. బ్యాంకులు, ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, ఉపాధ్యక్షులు కే సత్తిరాజు, జిల్లా కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు పలివేల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, ఆశా వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు అంకాడి పద్మావతి, చెక్కల వేణి, మలకా నాగలక్ష్మి, వెంకటలక్ష్మి, హార్నాథ్, మెస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఏచూరి శ్రీను, రాజశేఖర్, సూర్యనారాయణ, ఏఐటియుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎన్టియుసి ఏపీ అండ్ తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరి రాజు, ఇఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడండి

- ఎమ్మెల్యే పంతం నానాజీని కోరిన సర్పంచ్ బెజవాడ

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి త్రిమూర్తులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో తాగునీటి సమస్య పై సర్పంచ్ బెజవాడ వీర వెంకట సత్య నారా యణ ఎమ్మెల్యేతో మాట్లాడుతూ 1,50,000 మంది జనాభా ఉన్న రూరల్ మండలంలో గత రెండు నెలలుగా ఏడిబి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా వాటర్ పైపైన్ తీయడం వల్ల నీటి కొరతకు ఇబ్బంది ఏర్పడిందని ముఖ్యంగా మా తిమ్మాపురం గ్రామంలో పందూరు కుళాయి చెరువు నుండి వచ్చే వాటర్ ఆకు పచ్చ రంగులు ఉంటుందని ఆ నీటిని ప్రజలు ఉప యోగించుకోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారని ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించిన వాటర్ ప్రింటరైజేషన్ అవ్వటం లేదు అన్నారు. తాగు నీటి సమస్యపై దృష్టి పెట్టి అలాగే పందూరు పంపింగ్ స్కీం ప్రక్షాళన చేయాలని పూర్తి స్థాయిలో వాటర్ అందించాలని కోరుతూ ఎమ్మెల్యేకి చూపించి సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ రెండు నెలల్లో త్రాగునీటి, రోడ్డు, డ్రైవ్ మౌలిక సదుపాయాలు కల్పనే లక్ష్యంగా పూర్తిచేస్తా అని పూర్తిస్థాయిలో మండల ప్రజానీకానికి ఫిల్టర్ వాటర్ అందిస్తానని భరోసా ఇచ్చారు. నానాజీ సానుకూలంగా స్పం దించడంతో మండలంలోని గ్రామ సర్పంచ్‌లు అంతా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మం లో ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఆండ్రు అనిల్‌కు పరామర్శ

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్‌ను ఆదివారం రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రాజమహేంద్రవరం రోడా చైర్మన్ బొడ్డు అనంత వెంకటరామ చౌదరి తూర్పుగోదావరి జిల్లా బిజెపి అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పరామర్శించారు ఈసందర్భంగాస్వర్గీయ ఆండ్రు వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఇటీవల అనారోగ్యంతో గౌరీపట్నం మాజీ సర్పంచ్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆండ్రు వెంకటేశ్వరరావు మృతి చెందారు. దేవరపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్‌ను కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో గౌరీపట్నం గ్రామ టిడిపి అధ్యక్షులు కోటారు. ధ్రువకాంత్ పాతూరు గిరిధర్ ఆండ్రు సతీష్ ఉన్నారు.

కాకినాడ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఉన్న ఈత కొలనులో 10వ సబ్ జూనియర్, జూనియర్ అంతర్ జిల్లా ఈత పోటీలు జరిగాయి.

ఈ పోటీలకు సుమారు 150 మంది క్రీడాకారులు వివిధ కేటగిరీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ జాతీయ మారథాన్ స్విమ్మర్ గోలి శ్యామల మాట్లాడుతూ ప్రతి ఒకరు కూడా విద్యార్థి దశ నుంచే మంచి నడవడికి నేర్చు కుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరో హిస్తారని అన్నారు. కాకినాడ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో గ్రూప్ వన్ బాయ్స్ విభాగం నుంచి కే వీర శివకృష్ణ, ఎం గోకుల కన్నా, కే ముత్యాల ముఖేష్, వి మణికంఠ నవీన్, టి దుర్గేష్, గ్రూప్ వన్‌గర్ల్స్ విభాగంలో పి సహస్రశ్రీ, గ్రూప్ టు బాయ్స్ విభాగంలో, టీవీసీ సాయి సాకేత్, పి కౌశిక్ వర్ధన్, ఎస్ మిచిల్ అర్జున్, ఏ అభిసాయి, వై గౌతమ్, ఏ అక్షిత్, వీరాజ్ విజయ్ కాలే, వెనిస్టెంట్ చార్లెస్ స్టీఫెన్, గ్రూప్ టూ గర్ల్స్ విభాగంలో సిహెచ్ హిమద్యోతి, కే తనుశ్రీ, గ్రూప్ త్రీ బాయ్స్ విభాగంలో, కే దర్శిల్, ఎస్ క్రితిక్, ఎం షణ్ముఖేశ్వర్, ఏం సాయి చరణ్, జి భువనేష్, జి రోబిన్, గ్రూప్ త్రీ గర్ల్స్ విభాగంలో ఎస్ గుల్బర్, జి అన్విథ, ఏం పల్లవి, ఎం ఆశ్విని, ఎంపికయ్యారు. వీరంతా ఈనెల 19 20 తేదీల్లో విశాఖ పట్నంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పదవ సబ్ జూనియర్, జూనియర్ అంతర జిల్లాల ఈతల పోటీలో పాల్గొంటారు. స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్, కార్యదర్శి ఇరుసుమల్ల రాజు, ముఖ్య సలహాదారుడు మంగా వెంకట శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. మరో ముఖ్య అతిథి కాకినాడ చీఫ్ కోచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ ఎంపికలో కోచ్‌లు ఎం అజయ్ కుమార్, పివి నాయుడు, వి వీరభద్రయ్య, ఎల్ రాకేష్, జి మురళీకృష్ణ దగ్గరుండి ప్రతిభావంతులైన ఈత క్రీడాకారులను ఎంపిక చేశారు.

ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట భీమేశ్వర లయన్స్ క్లబ్ ఏర్పాటై 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిమ్మకాయల రంగనాగ్ హాజరై లైన్స్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫంక్షన్ హాల్ను ప్రారంభించారు. అనంతరం అమలకంటి శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ ఈదల ఈశ్వర్ కుమార్, లయన్స్ సీనియర్ చిత్తూరు రాజాలు మాట్లాడుతూ అన్ని జిల్లాల్లోని కన్నా మన సామర్లకోట లయన్స్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి మొట్టమొదటి స్థానంలో ఉన్నామని, రానున్న రోజుల్లో అతి తక్కువ ఖర్చుతో డయాగ్నిస్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా లయన్స్ పూర్వ అధ్యక్షులు మాజేటి కృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వెదురుమోడీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వెదురు మోడీలో 33/11 కేవీ అంగర సబ్ స్టేషన్‌లో సోమవారం 11 కెవి అంగర కొత్తబ్రేకర్ పెట్టడం వలన అంగర, టేకి, మాచరమట్లు, శ్రీరాంపురం మరియు వల్లూరు గ్రామాలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగును మరియు నల్లూరు గ్రామంలో ఆర్డిఎస్ఎస్ పనులు చేయడం వలన నల్లూరు గ్రామంలో కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగును కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసినదిగా రామచంద్రాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రత్నాలరావు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.

పంచాయతీ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - కొత్తపేట : ఈనెల తొమ్మిదో తేదీన పంచాయతీ కార్మికుల దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు రాగుల రాఘవులు కోరారు. కొత్తపేట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అమలాపురం డివిజన్ స్థాయి కార్మికులచే సార్వత్రిక సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని కార్మికులపై భారాన్ని మోపే విధంగా ప్రభుత్వం పని భారాన్ని మోపుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం ఆమోదించడాన్ని వ్యతిరేకించాలని, గ్రామపంచాయతీ కార్మికులకు ఈపీఎఫ్ ఈఎస్ఐ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు జీరో వన్ జీరో ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలని, కార్మిక చట్టాలను యధాతధంగా అమలు చేయాలని. సమ్మెలో కార్మికులందరూ పాల్గొని ప్రజల యొక్క వ్యతిరేకతను ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుబ్బల ఆదినారాయణమూర్తి, నాగ బత్తుల రవికుమార్, కొమ్మర ఆనంద్ పలివెల ప్రసాద్, మార్త రవీంద్ర, లంకా రమేష్, ఖండవిల్లి రాజబాబు, ముమ్మిడివరపు వెంకటేశ్వర రావు, రావులపాలెం ఏరియా గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు బంగారు మధు, గుంజ శ్రీను, ధనాల లక్ష్మీ పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్యుని జయంతి

విశాలాంధ్ర - పిఠాపురం : స్థానిక జగ్గయ్య చెరువులో ఎరుకుల ఆత్మగౌరవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతి ఘనంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్, ఎరుకుల ఆత్మగౌరవ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావాడ పోశయ్య ఆధ్వర్యంలో ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యతోనే ఏలవ్యుడు చరిత్రలో, పురాణ పురుషుడుగా నిలిచాడన్నారు. గురువు లేకున్నా స్వయంశక్తితో ఆయన గొప్ప విలుకాడు అయ్యాడని చెప్పారు. ప్రతి యువకుడు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత చదువులు అభ్యసించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారం సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దాసరి వీరలంక సజ్జా రాజేంద్ర, జగ్గంపేట సంఘం మండలాధ్యక్షుడు మానుపాటి ఈశ్వరరావు, ఏలేశ్వరం అధ్యక్షుడు బండి నూకరాజు. జనసేన నాయకులు, అర్బన్ క్రెడిట్ సొసైటీ మాజీ అధ్యక్షులు బాలిపల్లి రాంబాబు, నాయకులు గాలి కోటేశ్వరరావు, బాలరాజు, బండి చింతాలు, కావడి చిన్నికృష్ణ, పెద ఏసు కావడి, చిన ఏసు, మానే పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర 2047 సాధనలో భాగంగా

నియోజవర్గ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని ఒమ్మంగి గ్రామంలో లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో స్వర్ణాంధ్ర-2047 సాధనలో భాగంగా నియోజకవర్గ యాక్షన్ ప్లాన్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో 2047 నాటికి 15 శాతం అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గాలు వారిగా యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామన్నారు. ఈ యాక్షన్ ప్లాన్ కమిటీకి చైర్ పర్సన్‌గా ఎమ్మెల్యే సత్యప్రభగా, వైస్ చైర్మన్‌గా నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఏ శ్రీనివాసరావు మరియు ఎంపీడీవోలు, నగర పంచాయతీ కమిషనర్ మరియు మండల అధికారులు కమిటీ సభ్యులుగా ఉంటారు. నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి, నియోజకవర్గ ప్రగతికి, నియోజకవర్గ ప్రజల తలసరి ఆదాయం పెరిగేలా ఈ కమిటీ ప్రణాళికలు రూపొందించవలసి ఉంది. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రగతికి కూటమి సభ్యులు అనేక సూచనలు చేశారు. అలాగే భవిష్యత్తులో అమలు చేయవలసిన ప్రణాళికల గురించి, నియోజకవర్గ యాక్షన్ కమిటీ సభ్యులు వివరించారు. అలాగే నియోజకవర్గంలో ఈ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేయడం చాలా సంతోషమని, నియోజకవర్గ అభివృద్ధికి ఇది తొలిమెట్టుగా భావించవచ్చని అన్నారు. నియోజకవర్గ సమస్యలు వాటి పరిష్కార మార్గాలు భవిష్యత్తులో నియోజకవర్గాన్ని ఒక ఆదర్శవంతమైన నియోజకవర్గంగా రూపొందించేందుకు అధికారులు నాయకులతో అనుసంధానమై పనిచేయాలని పిలుపునిచ్చారు. అధికారులు నియోజవర్గ సమస్యలపై నిరంతర పరిశ్రమ ద్వారా మాత్రమే అవగాహన కల్పించుకోగలరని అన్నారు. త్రాగునీరు సాగునీరు విద్య వైద్యం వంటి వ్యవస్థలకు మెరుగైన ప్రణాళికల అవసరమని ఎమ్మెల్యే సత్య ప్రభ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పలువురు నియోజకవర్గంలోని వివిధ సమస్యలపై వినతి పత్రాల రూపంలో వారి ఆలోచనలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపీడీవోలు ఎంవిఆర్ కుమార్ బాబు, సూర్యనారాయణ, లక్ష్మారెడ్డి, శివరామకృష్ణయ్య, నగర పంచాయతీ కమిషనర్ ఎం సత్యనారాయణ, ఎన్డీఏ కూటమి శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

నూకాంబికా అమ్మవారి ఆలయ అభివృద్ధికి భారీ విరాళం

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని చింతలూరు శ్రీనూకాంబికా అమ్మవారి ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం ఆలమూరుకు చెందిన సత్యలక్ష్మి రైస్ మిల్స్ అధినేత వెత్సా గవరాజు అండ్ పార్ట్‌నర్స్ భారీ విరాళాన్ని అందించారు. ఆలయంలో రాజగోపురాల నిర్మాణంలో వినియోగించమని కోరుతూ రూ.1,00,116లు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో వెత్సా నెహ్రూ, వెత్సా సురేష్, వెత్సా రాము, వెత్సా గుప్తా, వెత్సా సూరిబాబు, ఆలమూరు నీటి సంఘం అధ్యక్షులు వైట్ల గంగరాజు, గన్ని సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య యూనివర్సిటీలో ఎన్‌సిసి క్యాంపు విజయవంతం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన ఎన్‌సిసి క్యాంపు విజయవంతంగా ముగిసినట్లు 18 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ మహమ్మద్ ఆసిఫ్ తెలిపారు. ఈ క్యాంపు లో కాకినాడ, ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి, కృష్ణా జిల్లాలో వివిధ పాఠశాలలు కళాశాలల నుండి 570 మంది వచ్చినట్లు తెలిపారు. క్యాంపులో భాగంగా రక్తదానం, సైబర్ సెక్యూరిటీ డ్రోన్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. దేశభక్తి దేశ రక్షణ వంటి వాటిపై క్యాడెట్స్‌కి అవగాహన కల్పించారు. ఇంతటి సౌకర్యవంతమైన, విశాలమైన పచ్చని ప్రాంగణంలో ఎన్‌సిసి క్యాంపు నిర్వహణకు ఆదిత్య యాజమాన్యం అందించిన సహాయ సహకారాలను అందించినందుకు మేజర్ మహమ్మద్ అసిఫ్ 18 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. చివరి రోజు సాంస్కృతిక కార్యక్రమాలతో క్యాంపును విజయవంతంగా ముగించారు. 27.06.2025 నుండి 06.07.2025 వరకు జరిగిన జాబుజ 8లో భాగంగా ఆదిత్య యూనివర్సిటీని సందర్శించిన కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వల్, 6 ఆంధ్ర నావల్ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ అజయ్ యాదవ్, క్యాంప్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రచార వాహనం ప్రారంభం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి క్లస్టర్ ఇంచార్జ్, మురారి గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్ నూతనంగా తయారు చేయించిన ప్రభుత్వ ఏడాది సుపరిపాలన తొలి అడుగు ప్రచార రథాన్ని ఆది వారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, కోర్పు సాయి తేజ, గద్దె అబ్బన్న, ఉండవిల్లి బుల్లిరాజు తదితరులు పాల్గొన్నారు.

దండు పుంతలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట పంచాయతీ పరిధి దండు పుంతలో షారోన్ ప్రేయర్ హాల్ పాస్టర్ జాషువా గిరి, షారోన్ నేతృత్వంలో దృష్టి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో దండుపుంతలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ జాషువా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కంటి చూపు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మనిషిలో ఏ అవయవంలో లోపాలు వచ్చిన జీవితాన్ని ఏదో విధంగా ముందుకు తీసుకెళ్లవచ్చని, కంటి సమస్య వస్తే జీవితం చీకటమయం అవుతుంది అన్నారు. అయితే కొన్ని ఆసుపత్రులు వైద్య విధానంలో ప్రజలను మోసం చేసి నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. కొన్ని ఆసుపత్రులు మాత్రం ప్రజా సేవ చేస్తున్నాయని దీనిలో దృష్టి ఆసుపత్రి ఒకటన్నారు. తమ విజ్ఞప్తి మేరకు దృష్టి ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మాధురి ఆసుపత్రి సిబ్బందితో దండుపుంతలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కంటి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి చాలామంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం నాయకులు రాయుడు అనిల్, యాదగిరి సత్యనారాయణ, జనసేన నాయకులు కుడి పూడి బాలాజీ, వైసీపీ నాయకులు నల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆషాఢ మాస సారె మహోత్సవం

విశాలాంధ్ర - రాజానగరం : ఆషాఢ మాసం, ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన రాజానగరంలో కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లులుగా పేరుగాంచిన శ్రీ ముత్యాలమ్మ ,శ్రీ నూకాలమ్మ అమ్మవార్లకు ఆదివారం జరిగిన ఆషాఢ సారె సమర్పణ ఊరేగింపు పండుగలు కన్నుల పండువగా జరిగాయి. గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ తొలిసారిగా నిర్వహించిన ఆషాఢం సారె వేడుకల్ని గ్రామ ప్రజలు,మహిళలు భక్తి పరవశంతో చేపట్టారు. ఇందులో భాగంగా పసుపు, కుంకుమ, గాజులు, రవికలు ప్రసాదాలు, సారె, కలశాలు,అమ్మవారి ప్రతిమలతో మహిళలందరూ కలిసి ఆటపాటలతో నృత్యాలు చేసుకుంటూ ఊరేగింపుగా అమ్మవార్ల ఆలయాలకు చేరుకున్నారు.తొలుత శ్రీ ముత్యాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో జ్యోతి కాంతులు జగజ్జననికి నీరాజనాలు పట్టాయి. కోలాటం, డోలు సన్నాయి నడుమ అమ్మవారిని పల్లకిలో ఊరేగింపుగా తీసుకురావడంతో మహిళా భక్తుల శరణుఘోషతో అమ్మవారి ఆలయ పరిసరాలు పులకించాయి. అనంతరం శ్రీ నూకాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు నేతృత్వంలో స్థానిక రామాలయం వద్ద నుండి మహిళలు బోనాలు నెత్తిన ఎత్తి,ఆషాఢ సారెను ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విశాలాంధ్ర
సోమవారం ।07। జులై। 2025

సీపీఐ ఏలూరుజిల్లా మహాసభ దృశ్యమాలిక

చింతలపూడిలో ఆదివారం జరిగిన సీపీఐ ఏలూరు జిల్లా ద్వితీయ మహాసభల సందర్భంగా ప్రతినిధుల సభలో పాల్గొన్న నేతలు

మహిళకు మంత్రి సుభాష్ ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర - కాకినాడ : ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న మహిళకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. కాకినాడ సంజయ్ నగర్‌కు చెందిన దమ్ము లక్ష్మి కాకినాడ పర్యటనలో ఉన్న మంత్రి సుభాష్‌ను కలిసి తాను ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నానంటూ మంత్రికి తన సమస్యలు వివరించింది. తన భర్త రాము ఆరోగ్యం కూడా సక్రమంగా లేనం దున సహాయం చేయాలంటూ కోరింది. తక్ష ణం స్పందించిన మంత్రి సుభాష్ రూ.10 వేలు చెక్కు ద్వారా ఆర్థిక సహాయం అందించారు. మంత్రి సుభాష్ వెంట శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, జాతీయ బీసీల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ చొల్లంగి వేణు గోపాల్, నురుకుర్తి వెంకటేశ్వర్లు, పలువురు బీసీ సంఘాల నాయకులు ఉన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి యోగా పోటీలు

విశాలాంధ్ర - అమలాపురం : అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రోటరీ క్లబ్ అమలాపురం వారి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి యోగాసనాలు పోటీలను "శ్రీ స్వామి వివేకానంద యోగా ఆశ్రమం" గురువులు, ఆయుర్వేదం ఫిజియోథెరపీ వైద్యుడు యోగా శ్రీనివాస్ ఆధ్వర్యంలో, ఇంటర్నేషనల్ యోగాసనాలు జడ్జి కేఎస్ వి శ్రీధర్ సాంకేతిక సహకారంతో నిర్వహించారు. 10 సంవత్సరముల నుండి 80 సంవత్సరముల వరకు అన్ని వయసుల వారికి యోగాసనాలు పోటీలను నిర్వహించారు. విజేతలకు రోటరీ క్లబ్ అమలాపురం నగదు పారితోషకం, సర్టిఫికెట్లు, మెడల్స్, ట్రోఫీ లతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అమలాపురం అధ్యక్షులు ఆర్డి ఎస్ ప్రసాద్, కార్యదర్శి పవన్ ఆకొండి, కోశాధికారి శశిధర శ్రీరామ్, రోటరీ పెద్దలు వరద మల్లిబాబు కంకటాల వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు అప్పన వీరన్న, కొల్లూరి ప్రసాద్ పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్‌ను జయప్రదం చేయండి

విశాలాంధ్ర -భీమవరం: 10వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో "మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్" పండుగలా నిర్వహించాలనని, అందరూ భాగ స్వాములై విజయవంతం చేయాలని, ప్రతి విద్యార్థి అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని కలెక్టర్ చదల వాడ నాగరాణి అన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి గూగుల్ మీ ద్వారా మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై ఆదివారం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, డి ఆర్ ఓ మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు, జిల్లా విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అటవీ శాఖ అధికారి, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, ప్రైవేట్ పాఠశాలల, జూనియర్ కళాశాలల అసోసియేషన్స్ ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 10వ తేదీన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమం నిర్వహణకు పండుగ వాతావరణంలో, ఎటువంటి లోటుపాట్లు లేకుండా సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మెంబర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పాఠశాలల పూర్వ విద్యార్థులు, ప్రముఖులను ఆహ్వానించి వారందరినీ భాగస్వామ్యం చేయాలన్నారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా కొత్త స్కూల్ యూనిఫామ్ ధరించి విధిగా హాజరయ్యాలా చూడాలని ఆదేశించారు. తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలో విద్యార్థులు చేత వారి తల్లులకు పాద పూజ కార్యక్రమం నిర్వహించాలన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రతి విద్యార్థి చేత అమ్మ పేరుతో ఒక మొక్కను నాటించే ఏర్పాటు చేయాలని. ప్రతి పాఠ శాలకు మొక్కలను సరఫరా చేసే బాధ్యత సంబంధిత అధికారులు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు హోలీ స్టిక్ ప్రోగ్రెస్ కార్డులను అందించి విద్యార్థుల చదువుకు సంబంధించి తల్లిదండ్రులకు వివరించా లన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని సంబంధిత అధికారులు అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వ హించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమానికి సంబంధించి జరిగిన ఏర్పాట్లపై సంబంధిత ఫోటోలు, వీడియోలు ఈనెల 8 తేదీ నుండి సంబంధిత వెబ్సైట్లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. మెగా పిటిఏం కంటే ముందుగా పిల్లల ఆరోగ్య సమాచారాన్ని ముందుగానే పరీక్ష చేసి నమోదు చేయా లని, అలాగే పాఠశాలు, కళాశాలల వద్ద అవసరం మేరకు మెడి కల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డి ఎం అండ్ హెచ్ ఓ ని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణలో ఏమైనా ఇబ్బం దులు, సమస్యలు ఉంటే జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నెంబరు 8816299181 ఫోన్ చేసి సంప్రదిం చాలని అన్నారు. గూగుల్ మీట్లో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఆర్డీవోలు, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంఈఓలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల, జూనియర్ కళాశాలల అసోసియేషన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు యధావిధిగా పిజిఆర్ఎస్ : కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : ప్రజా సమస్యలు పరిష్కార కోసం జిల్లా, డివిజన్ మండల స్థాయిలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ జూలై 7 వ తేదీ సోమవారం యధావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటన లో తెలియచేశారు.ప్రజలు తమ అర్జీలను ఇవ్వడం కోసం "1100" మీ-కోసం కాల్ సెంటర్" కు ఫోన్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయుటకు, నమోదైన మీ అర్జీ ప్రస్తుత స్థితీ తెలుసుకోవచ్చునని ఆమె తెలిపారు. జూలై 7 వ తేది ఉదయం 10.00 నుంచి మ.1.00 వరకు ప్రజల నుంచి పీజీఆర్ఎస్ అర్జీలను జిల్లా , డివి జన్, మునిసిపల్, మండల, సచివాలయ స్థాయిలో స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం mee kosam.ap.gov.in పోర్టల్ లేదా 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా నమోదు చేసుకునే వెసులుబాటు రాష్ట్ర ప్రభుత్వం కల్పించామన్నారు. నేరుగా అర్జీలు ఇవ్వ లేని వారు మీ కోసం వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా మీ ఫిర్యాదు నమోదు చేయవచ్చు అని ఆమె తెలియచేశారు. వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 ద్వారా ప్రజలకి పౌరసేవలు పొందవచ్చు అని పేర్కొన్నారు. అందుకోసం ప్రజలు వారి సెల్ ఫోన్లులో ఈనంబర్ సేవ్ చేసుకోవాలని కోరారు.

2009 ఎస్సై బ్యాచ్ మృతుల కుటుంబాలకు పరామర్శ, చేయూత

విశాలాంధ్ర - ఆలమూరు : ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 2009 ఎస్ఐల బ్యాచ్‌కు చెందిన 1100 మంది తమ బ్యాచ్‌మేట్ ఆలమూరు ఎస్సైగా పనిచేస్తూ మృతి చెందిన ఎం అశోక్‌కు స్వగ్రామమైన సర్పాపురం ఆయన నివాసానికి విచ్చేసి ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. 2025 జూన్ 26వ తేదీ తెల్లవారు జామున, విధి నిర్వహణలో ఉన్న సమయంలో ఎస్సై ఏం అశోక్, కానిస్టే బుల్ బ్లెస్సన్ జీవన్ కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరిద్దరూ మృత్యువాత పడిన విషయం విధితమే. ఈ సందర్భం గా, 2009 బ్యాచ్‌కి చెందిన అధికారి బృం దం అశోక్ కుటుంబాన్ని పరామర్శించి, ఆయన భార్య, ఇద్దరు కుమారులకు ఒకరు బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి, మరొకరు 9వ తరగతి విద్యార్థి లకు ధైర్యాన్ని, మానసిక మద్దతును ఇచ్చారు. అలాగే 2009 ఎస్ఐల బ్యాచ్ తరపున ఏర్పాటైన వెల్ఫేర్ సొసైటీ ద్వారా రూ.26 లక్షల చెక్కును అశోక్ కుటుంబానికి అందించారు. కానిస్టేబుల్ బ్లెస్సన్ జీవన్ స్వగ్రామమైన ఆలమూరును కూడా వారు సందర్శించి, కానిస్టేబుల్ జీవన్ చిత్రపటం వద్ద నివాళులర్పించి, ఆయన కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారికి ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి సహాయ సహకారాలు అందించిన రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్ విద్యాసాగర్ మాట్లాడుతూ వీరంతా 2009 ఎస్సైల బ్యాచ్ అన్నారు. అలాగే వీరంతా కలిసి 2020 లో వెల్ఫేర్ సొసైటీ స్థాపించుకున్నారన్నారు. అప్పటి నుండి ఈ సొసైటీ ద్వారా వారి బ్యాచ్‌కి చెందిన అవసరంలో ఉన్న కుటుంబాలకు ఇప్పటి వరకు రూ.2 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించ డం ఆయన వివరిం చారు. ఇది పోలీస్ శాఖలో ఒక దృఢమైన ఐక్యత, మానవీయత, సహచరత్వానికి చక్కటి ఉదాహరణగా నిలుస్తుందని సిఐ విద్యాసాగర్ పేర్కొన్నారు. 2009 బ్యాచ్ ప్రారంభించిన ఈ నైతిక విధానం ప్రేరణగా, ఇతర బ్యాచ్లు కూడా ఇటువంటి వెల్ఫేర్ సమితులను ఏర్పాటు చేసి, సహాయసహకారాలను కొనసాగించడం గమనార్హం అన్నారు. "చిన్న చిన్న సహాయాలు కలిస్తే, ఒక కుటుంబ జీవితాన్ని మారుస్తాయి" అనే నమ్మకంతో ఈ సమితి ముందుకు సాగుతూ ఆదర్శంగా నిలుస్తుందన్నారు.